సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం ౹ 11 ౹ ఫిబ్రవరి ౹ 2025



ఆపద్బాంధవులకు ప్రోత్సాహం

ఎక్కడైనా ప్రమాదం జరిగిన గంటలోగా క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించిన వారికి ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తుంది. 8లో



పదో రోజుకు చేరిన సమ్మె

సమస్యల పరిష్కారం కోసం లక్ష్మీదేవిపల్లిలో పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె సోమవారం పదో రోజుకు చేరింది. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
36° / 18°

జిల్లాలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. రాత్రి వాతావరణం కొంత చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారు ముత్తంగి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామి వారిని ఈ రూపంలో అలంకరించడం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువు దీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

వైభవంగా సహస్ర కలశాభిషేకం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారికి సహస్ర కలశాభిషేకం కార్యక్రమాన్ని సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా అర్చకులు మేళతాళాల నడుమ గోదావరి నది నుంచి తీర్థబిందె తీసుకొచ్చారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వైభవంగా కలశాభిషేకం గావించారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

చుంచుపల్లి : భద్రాచలం, సారపాక గ్రామపంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఆమోదం, అభ్యంతరాల స్వీకరణపై జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎం.విద్యాచందన సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భద్రాచలం, సారపాక పంచాయతీల పరిధిలో పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఆమోదం, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ ఈనెల 13 వరకు కొనసాగుతుందని, అందరూ సహకరించాలని కోరారు. భద్రాచలం జీపీలో 41,008 మంది ఓటర్లకు 60 పోలింగ్ కేంద్రాలు, సారపాకలో 19,045 మంది ఓటర్లకు 36 కేంద్రాలను గుర్తించామని చెప్పారు. మండల స్థాయిలో రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం సమీక్ష నిర్వహిస్తామని, ఏదైనా పోలింగ్ కేంద్రాల గుర్తింపులో అభ్యంతరాలు లేదా ఓటర్లకు దూరంగా ఉంటే లిఖిత పూర్వకంగా స్థానిక ఎంపీడీఓలకు ఫిర్యాదు చేయాలని సూచించారు. 12వ తేదీన అభ్యంతరాలను పరిశీలించి 14న తుది జాబితా విడుదల చేస్తామని తెలిపారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, డీపీఓ చంద్రమౌళి, ఆయా పార్టీల నేతలు పాల్గొన్నారు.

సీతారామ, సీతమ్మసాగర్‌లపై నేడు టీఏసీ సమావేశం

అశ్వాపురం: ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో 6.74 లక్షల ఎకరాలకు సాగునీరందించే సీతారామ, సీతమ్మ సాగర్ ప్రాజెక్టులకు సంబంధించి సీడబ్ల్యూసీ టెక్నికల్ అడ్వైజరీ కమిటీ(టీఏసీ) సమావేశం మంగళవారం ఢిల్లీలో జరగనుంది. రాష్ట్ర ప్రభుత్వం సీతారామ ప్రాజెక్ట్ పనులు వేగవంతంగా చేపడుతుండగా.. తెలుగు రాష్ట్రాల మధ్య గోదావరి జలాల సమస్యతో ఏపీ ప్రభుత్వం తెలంగాణలో చేపడుతున్న పలు ప్రాజెక్టులపై గోదావరి బోర్డుకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో సీతారామా ప్రాజెక్టుపైనా అభ్యంతరం వ్యక్తం చేసింది. అయితే ఈ ప్రాజెక్టుకు సాంకేతిక అనుమతులపై చర్చించేందుకు సీడబ్ల్యూసీ టెక్నికల్ అడ్వైజరీ కమిటీ నేడు సమావేశం నిర్వహించనుంది. టీఏసీ క్లియరెన్స్ వస్తే అపెక్స్ కౌన్సిల్ అనుమతి రావాల్సి ఉంటుంది. ఈ రెండూ వస్తే ప్రాజెక్టుకు సంబంధించి అన్ని రాకల అనుమతులు వచ్చినట్టు అవుతుంది. ఇక సీతమ్మ సాగర్ ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ శాఖ నుంచి అనుమతులు రావాల్సి ఉంది.

‘మండలి’ కోలాహలం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ముగిసిన నామినేషన్లు



ఉమ్మడి ఖమ్మం – నల్లగొండ – వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఈనెల 27న పోలింగ్ జరగనుంది. సోమవారంతో నామినేషన్ల గడువు ముగియగా, 23 మంది 50 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఈనెల 13న ఉపసంహరణ గడువు ముగిశాక బరిలో మిగిలిన అభ్యర్థుల సంఖ్య తేలనుంది. ఇప్పటికే అభ్యర్థులు ప్రచారంలో నిమగ్నం కాగా, ప్రధాన పార్టీల నాయకులు సైతం సంఘాల వారీగా అభ్యర్థులకు మద్దతు ప్రకటించి వారి విజయానికి వ్యూహాలు రచిస్తున్నారు. ప్రస్తుతం నామినేషన్ల గడువు ముగిసిన నేపథ్యాన ప్రచారం మరింత జోరందుకోనుంది.

– సాక్షి ప్రతినిధి, ఖమ్మం

- ఉపసంహరణ అనంతరం 13న అభ్యర్థుల ఖరారు
- ఉమ్మడి జిల్లాలో 6,111 మంది ఓటర్లు
- ఇప్పటికే ప్రచారంలో నిమగ్నమైన అభ్యర్థులు

అలుగుబెల్లి పదవీకాలం ముగియడంతో..

2019 మార్చిలో జరిగిన ఎన్నికల్లో ఈ స్థానం నుంచి వివిధ ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థిగా బరిలోకి దిగిన అలుగుబెల్లి నర్సిరెడ్డి రెండో ప్రాధాన్యత ఓట్లతో విజయం సాధించారు. రెండో స్థానంలో పీఆర్‌టీయూ టీఎస్ అభ్యర్థి పూల రవీందర్ నిలిచారు. ప్రస్తుతం నర్సిరెడ్డి పదవీ కాలం ముగియడంతో గతనెల 29న కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. ఈ ఎన్నికకు సంబంధించి నల్లగొండలో ఈనెల 3 నుంచి సోమవారం వరకు నామినేషన్లు స్వీకరించారు. ఈనెల 11న పరిశీలన, 13న ఉపసంహరణ ఉండగా, 27న పోలింగ్ నిర్వహిస్తారు. వచ్చే నెల 3న ఓట్ల లెక్కింపు మొదలు కానుంది. కాగా, ఖమ్మం జిల్లాలో 4,089 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2,022 మంది ఉమ్మడి జిల్లాలో 6,111 మంది ఓటర్లు ఉన్నారు. ఇక రెండు జిల్లాల్లో ఎన్నికల నిర్వహణకు 47 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. కాగా, మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో డిసెంబర్ 30న ప్రకటించిన జాబితా ప్రకారం 24,905 మంది ఓటర్లు ఉండగా, ఆ తర్వాత కూడా నమోదుకు అవకాశం కల్పించారు. దీంతో మరో 892 మంది నమోదు చేసుకోగా సోమవారం విడుదల చేసిన తుది జాబితా ప్రకారం 25,797 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

పార్టీల మద్దతుతో..

గతంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు పార్టీలకు అతీతంగా జరిగేవి. సంఘాల వారీగా అభ్యర్థులకు రాజకీయ పార్టీలు అంతర్గతంగా మద్దతు ఇచ్చేవి. కానీ ఇప్పుడు పలువురు అభ్యర్థులకు రాజకీయ పార్టీలు బహిరంగంగానే మద్దతు ప్రకటించాయి. టీపీయూఎస్ మద్దతుతో బరిలో నిలుస్తున్న పులి సరోత్తమ్‌రెడ్డికి బీజేపీ మద్దతు ప్రకటించడంతో పాటు ఆ పార్టీ నేతలు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక మద్దతుపై కాంగ్రెస్ ఇప్పటివరకైతే ప్రకటన చేయకున్నా ఒకటి, రెండు రోజుల్లో స్పష్టత వస్తుందని భావిస్తున్నారు. మరోపక్క ఎవరికీ మద్దతు ఇవ్వడం లేదని బీఆర్‌ఎస్ వెల్లడించింది.

మరోసారి బరిలో..

ఈ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి గతంలో పోటీ చేసి విజయం సాధించిన, ఓటమి చెందిన వారంతా మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు బరిలోకి దిగారు. గత ఎన్నికల్లో విజయం సాధించిన అలుగుబెల్లి నర్సిరెడ్డి టీఎస్ యూటీఎఫ్ నుంచి పోటీ చేస్తుండగా టీపీటీఎఫ్‌తోపాటు పలు సంఘాలు మద్దతు తెలిపాయి. పీఆర్‌టీయూ టీఎస్ నుంచి పింగిలి శ్రీపాల్, టీపీయూఎస్ నుంచి బరిలో నిలుస్తున్న పులి సరోత్తమ్ రెడ్డికి పలు సంఘాలు మద్దతు ప్రకటించాయి. అలాగే మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి. ఎస్.సుందర్‌రాజు సైతం నామినేషన్లు దాఖలు చేశారు. వీరితో పాటు ఇతర ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో కొందరు, పలువురు స్వతంత్రులు పోటీకి దిగుతున్నారు.

పోటాపోటీగా నమోదు..

బరిలో నిలవాలనుకున్న ఆశావహులు పోటాపోటీగా ఉపాధ్యాయులతో ఓటర్లుగా నమోదు చేయించారు. ఈ మేరకు 23 మంది 50 సెట్ల నామినేషన్లు సమర్పించగా, ప్రధాన సంఘాల అభ్యర్థులు ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ప్రచారం చేపట్టారు. పట్టణాల్లో సమావేశాలు నిర్వహించడంతో పాటు ఉపాధ్యాయులను వ్యక్తిగతంగా కలిసి తమకే ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. తమను గెలిపిస్తే విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పాటుపడతామని హామీలు గుప్పిస్తున్నారు. ప్రధాన సంఘాల నుంచే కాక స్వతంత్ర అభ్యర్థులు సైతం బరిలో ఉండడంతో నామినేషన్ల ఉపసంహరణ తర్వాత ప్రచారపర్వం మరింత వేడెక్కనుంది.

వెదురు సాగుతో సిరుల పంట

కలెక్టర్ జితేష్ వి పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): వెదురు సాగు చేసిన రైతుల ఇంట సిరుల పంట పండుతుందని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. ఇండస్ట్రీ క్రాఫ్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చంద్రుగొండ, ములకలపల్లి, గుండాల మండలాల అటవీ, ఇతర శాఖల సిబ్బందికి వెదురు పెంపకంపై కలెక్టరేట్‌లో సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో వెదురు సాగు లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. జిల్లాలో వెదురుసాగుకు సులభమైన పద్ధతులు, వివిధ రకాల వెదురు సాగు, దానివల్ల ఉపయోగాలు, వెదురు ఉత్పత్తులు తదితర అంశాలపై రెండురోజుల పాటు శిక్షణ తరగతులు కొనసాగుతాయని వివరించారు. చంద్రుగొండ, ములకలపల్లి, గుండాల మండలాల భూములు వెదురుసాగుకు అనుకూలంగా ఉంటాయని, సాగుకు అవసరమైన నీటి వనరులు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. ఐదెకరాల భూమి, బోరు సౌకర్యం ఉన్న రైతులు ఒక ఎకరంలో వెదురుసాగు చేసేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వెదురుసాగుతో ఆర్థికాభివృద్ధి చెందుతారని అన్నారు. మునగ, వెదురు పంటల సాగు అన్ని సమస్యలకు పరిష్కారమని చెప్పారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో వెదురును విరివిగా వినియోగిస్తున్నారని, నంద్యాలలో ఓ సిమెంట్ ఫ్యాక్టరీ వారు కూడా కొనడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, ఉద్యాన శాఖాధికారి కిషోర్, ఇండస్ట్రీ క్రాఫ్ట్ ఫౌండేషన్ ప్రోగ్రామ్ మేనేజర్ రమ్య, డాక్టర్ శ్రీకాంత్, ఆపరేషన్ మేనేజర్లు అమృత, అక్షయ్, టెక్నికల్ మేనేజర్ కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల చెంతకు సంక్షేమ పథకాలు..

- ఆదివాసీల జీవనశైలి ఉట్టిపడేలా మ్యూజియం
- ఐటీడీఏ పీఓ రాహుల్



గిరిజనుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న పీఓ రాహుల్

భద్రాచలం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను గిరిజనుల చెంతకు చేర్చేలాఅధికారులు పాటుపడాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌లో ఆయన గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించాక అధికారులకు సూచనలు చేశారు. ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసి అర్హతల ఆధారంగా పరిష్కరించాలని తెలిపారు.

ఆకట్టుకునేలా ఉండాలి

ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియంలో వస్తువులు, చిత్రాలు ఆదివాసీల జీవన శైలి ఉట్టిపడేలా ఉండాలని పీఓ రాహుల్ తెలిపారు. మ్యూజియం లోపల, ముఖద్వారం వద్ద వేస్తున్న చిత్రాలను పరిశీలించిన ఆయన క్రాఫ్ట్ టీచర్లకు సూచనలు చేశారు. గిరిజనుల జీవన విధానం, వారి దుస్తులు, అలంకరణ, వృత్తులు, పూజా విధానం చిత్రాల ద్వారా తెలిసేలా ఉండాలని చెప్పారు. ఆతర్వాత బాక్స్ క్రికెట్ ఏర్పాట్లపై ఆరా తీసిన పీఓ, గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేయడానికి కొనుగోలు చేసిన కంప్యూటర్లను పరిశీలించారు. ఈకార్యక్రమాల్లో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ఏఓ సున్నం రాంబాబు, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, వివిధ విభాగాల అధికారులు గోపాలరావు, చంద్రశేఖర్, రవీంద్రనాథ్, ఉదయ్‌భాస్కర్, వేణు, లక్ష్మీనారాయణ, ఉదయ్‌కుమార్, మణిధర్, సమ్మయ్య, ఆదినారాయణ, నారాయణరావు, లింగానాయక్, వీరస్వామి, బేబీ సునంద, సరస్వతి, రాంబాబు, మూర్తి, చలపతిరావు పాల్గొన్నారు.

‘పరిషత్’ లెక్క తేలింది..

- జిల్లాలో 6,81,174 మంది ఓటర్లు
- తుది జాబితా ప్రకటించిన అధికారులు
- ప్రాదేశిక ఎన్నికల ఏర్పాట్లు వేగవంతం
- జిల్లాలో 1,253 పోలింగ్ కేంద్రాలు సిద్ధం



జెడ్పీ కార్యాలయంలో తుది ఓటర్ల జాబితా ప్రదర్శిస్తున్న సీఈఓ నాగలక్ష్మి

చుంచుపల్లి : జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు జిల్లాలో ఏర్పాట్లు వేగవంతమయ్యాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తుది ఓటరు జాబితాల రూపకల్పనతో పాటు పోలింగ్ కేంద్రాల గుర్తింపు ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. జిల్లాలోని 22 గ్రామీణ మండలాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల వివరాలను అధికారులు సోమవారం వెల్లడించారు. జిల్లాలో 6,81,174 మంది ఓటర్లు ఉన్నట్లు లెక్క తేల్చారు. ఇందులో పురుషులు 3,31,336 మంది, మహిళలు 3,49,816 మంది, ఇతరులు 22 మంది ఉన్నారు. ఎన్నికల నిర్వహణకు జిల్లాలో 1,253 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు.

236 ఎంపీటీసీ, 22 జెడ్పీటీసీ స్థానాలు..

జిల్లాలో 236 ఎంపీటీసీ స్థానాలు, 22 జెడ్పీటీసీ స్థానాలకు త్వరలో ఎన్నికలు నిర్వహించేలా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈసారి భద్రాచలం మండలం కొత్తగా ఏర్పాటు కానుంది. గత నాలుగైదు రోజులుగా సాధారణ ఓటర్ల జాబితాల ఆధారంగా పరిషత్ ఓటర్ల గుర్తింపుపై కసరత్తు చేసిన పంచాయతీరాజ్ అధికారులు.. ఆయా మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో తుది జాబితాలను అందుబాటులో ఉంచారు. పంచాయతీల కంటే ముందుగానే మండల, జిల్లా పరిషత్‌లకు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్న తరుణంలో ఈనెల 12న ఐడీఓసీలో సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కాగా, జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరుగుతాయి. రిజర్వేషన్ ప్రకారం మహిళలకు 50 శాతం సీట్లు కేటాయించేలా వెసులుబాటు కల్పిస్తారు.

మండలాల వారీగా ఓటర్ల వివరాలు

ఆళ్లపల్లి	9,285	గుండాల	13,287
అన్నపురెడ్డిపల్లి	16,962	జూలూరుపాడు	28,070
అశ్వాపురం	33,564	కరకగూడెం	12,879
అశ్వారావుపేట	30,805	లక్ష్మీదేవిపల్లి	32,854
భద్రాచలం	41,008	మణుగూరు	37,229
బూర్గంపాడు	50,420	ములకలపల్లి	28,236
చంద్రుగొండ	23,893	పాల్వంచ	29,107
చర్ల	32,744	పినపాక	27,324
చుంచుపల్లి	39,758	సుజాతనగర్	23,438
దమ్మపేట	44,687	టేకులపల్లి	42,040
దుమ్ముగూడెం	36,772	ఇల్లెందు	46,812

విజ్ఞానశాస్త్రంపై ఆసక్తి పెంచుకోవాలి



డీఈఓ నుంచి బహుమతి అందుకుంటున్న గీత

కొత్తగూడెంఅర్బన్: విజ్ఞాన శాస్త్రంపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని, ప్రతిభా పాటవ పోటీలు అందుకు దోహదం చేస్తాయని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి అన్నారు. జిల్లా విద్యా శిక్షణ కేంద్రంలో ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన జిల్లా స్థాయి ప్రతిభా పాటవ పోటీల బహుమతి ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు భౌతిక శాస్త్రాన్ని ఆసక్తితో అభ్యసించాలని, సమాజానికి అవసరమైన నూతన ఆవిష్కరణలు చేయాలని పిలుపునిచ్చారు. జయాపజయాలను సమానంగా స్వీకరించాలని, ఇలాంటి పోటీల్లో పాల్గొనడమే గొప్ప విజయంగా భావించాలని సూచించారు. ఈ పోటీల్లో టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎన్.గీత ప్రథమ, సారపాక ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.వల్లిశ్రీ అశ్విని ద్వితీయ, భద్రాచలం జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని వై. హాసిని తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. వీరు ఈనెల 12న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి ప్రతిభాపాటవ పోటీకి ఎన్నికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయ కార్యదర్శి ఎస్.మాధవరావు, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.నాగరాజశేఖర్, సమ్మిళిత విద్య కోఆర్డినేటర్ ఎస్‌కే సైదులు, ఎఫ్‌పీఎస్‌టీ అధ్యక్షులు షేక్ ఎల్.అమిరుద్దీన్, ప్రధాన కార్యదర్శి బి.సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫిజిక్స్ టాలెంట్ టెస్టులో ప్రతిభ

టేకులపల్లి: ఫిజికల్ సైన్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన టాలెంట్ టెస్టులో టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని నెల్లూరి గీత జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి పొంది రాష్ట్ర స్థాయి పోటీకి అర్హత సాధించింది. ఈ మేరకు డీఈఓ చేతుల మీదుగా బహుమతి అందుకుంది. కాగా, గీతతో పాటు ఫిజిక్స్ టీచర్ ఎం.మోహన్‌రావును హెచ్‌ఎం మేరుగు శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. జూలూరుపాడు మండలంలోని పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా పలు పనులు చేపట్టగా బిల్లులు మంజూరు కాలేదని కాంట్రాక్టర్ రాములు ఇచ్చిన ఫిర్యాదును ఐటీడీఏ పీఓకు ఎండార్స్ చేశారు. లక్ష్మీదేవిపల్లి మండలం గట్టుమళ్ల పంచాయతీ పరిధిలోని గంగమ్మ కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, తమ పిల్లలకు ఆధార్‌కార్డుల మంజూరుకు జనన ధ్రువీకరణ పత్రాలు ఇప్పించాలని స్థానికులు కోరగా కలెక్టరేట్ డి సెక్షన్ సూపరింటెండెంట్, విద్యుత్ ఎస్ఈలకు ఎండార్స్ చేశారు.


జాతీయ పోటీలకు ఎంపిక



బహుమతి అందుకుంటున్న చంద్రకళ

అశ్వాపురం: కొత్తగూడెం క్లబ్‌లో ఈనెల 9 వరకు జరిగిన తెలంగాణ మాస్టర్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో అశ్వాపురానికి చెందిన చంద్రకళ సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలవగా.. మార్చిలో గోవాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ రాహుల్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, కార్యదర్శి రాజేందర్, డాక్టర్ సావిత్రి చేతుల మీదుగా బహుమతి అందజేశారు.

క్రీడలతో మానసికోల్లాసం



మాట్లాడుతున్న దినేష్‌కుమార్ శుక్లా

అశ్వాపురం: క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని అటామిక్ ఎనర్జీ రెగ్యులేటర్ బోర్డు చైర్మన్ దినేష్‌కుమార్ శుక్లా అన్నారు. మండల కేంద్రంలోని భారజల కర్మాగారం ఆధ్వర్యంలో భారత అణుశక్తి విభాగం(డీఏఈ) స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్‌లో భాగంగా బ్యాడ్మింటన్ పోటీలను భారజల బోర్డు చైర్మన్ సత్యకుమార్‌తో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇలాంటి క్రీడా పోటీలతో ఉద్యోగుల మధ్య స్నేహ సంబంధాలు బలోపేతం అవుతాయని అన్నారు. బోర్డు చైర్మన్, సీఈ సత్యకుమార్ మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో ఆడాలని అన్నారు. కాగా, పోటీలకు భారత అణుశక్తి విభాగంలోని ఎనిమిది కర్మాగాల నుంచి అజంతా, ఎల్లోరా, పుష్కర్, నాగార్జున, గోల్కొండ, కోణార్క్, ద్వారకా, రామేశ్వరం జట్లు పాల్గొంటున్నాయి. కార్యక్రమంలో క్రీడల కన్వీనర్ ముదిత్ శ్రీవాత్సవ, భారజల కర్మాగారం జీఎం హెచ్ కే.శర్మ, కో కన్వీనర్ రఫిక్ అహ్మద్, సీఏఓ వేణు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మహాకుంభాభిషేక వేడుకలు



శివాలయంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

- ఐదు రోజుల పాటు అమ్మవారికి ‘పుష్కర’ పూజలు
- నూతన శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠ

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని జగన్నాథపురం – కేశవాపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో పుష్కర(షష్టాబ్ది) మహాకుంభాభిషేక వేడుకలు సోమవారం ముగిశాయి. నూతనంగా నిర్మించిన శివాలయంలో విగ్రహ, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. పీఠాధిపతులు అనంత సచ్చిదానంద, సరస్వతి స్వామి వారి ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యావాచనం చేశారు. ఆ తర్వాత శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, దృష్టి కుంభం, అమ్మవారి సన్నిధిలో మహాకుంభాభిషేక వేడుకలను వైభవంగా జరిపించారు.

ముందుకొచ్చిన దాతలు..

స్వామివారికి మకర తోరణం, కల్యాణానికి పట్టువస్త్రాలు, మంగళసూత్రాలను మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, ధ్వజస్తంభాన్ని మహిపతి రామలింగం అందజేశారు. ఇంకా బాదర్ల బాబ్జీ, సందుపట్ల శ్రీనివాసరెడ్డి, నందూరు శ్రీనివాస్, బిక్షపతి, వెంకటేశ్వరరావు, పెండ్యాల సతీష్ కూడా పలు ఆభరణాలు, వస్తువులను వితరణ చేశారు. పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, దేవాదాయ శాఖ ఏసీ ఎం.వీరస్వామి, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాలశ్రీనివాసరావు, ఆలయ ఈఓ రజనీకుమారి పాల్గొన్నారు.



ప్రతిష్ఠ పూజల్లో కలెక్టర్ జితేష్ వి పాటిల్



హాజరైన ఎమ్మెల్యే కూనంనేని

క్లుప్తంగా

కరాటే పోటీల్లో ఆరు పతకాలు



క్రీడాకారులతో అసోసియేషన్ బాధ్యులు

కొత్తగూడెంటౌన్: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఆరు పతకాలు సాధించారు. ఈ మేరకు సోమవారం జిల్లా కూంగ్‌ఫూ కరాటే అకాడమీ ప్రధాన కార్యదర్శి, కోచ్ పేడపాటి నిహారిక వివరాలు వెల్లడించారు. అండర్–10 బాలుర కటాస్ విభాగంలో బి.భానుకృష్ణ కాంస్య పతకం, బాలికల కటాస్ విభాగంలో ఎంఏ సనాలు బంగారు పతకం సాధించారు. అండర్–12 బాలుర కటాస్ విభాగంలో ఏ.జస్వంత్ బంగారు పతకం, ఎంఏ ఆయాన్ వెండి పతకం కైవసం చేసుకున్నారు. అండర్–14 బాలురు కటాస్ విభాగంలో ఎల్.హర్షిత్ వెండి పతకం, బాలికల కటాస్ విభాగంలో ఏ.ఆశ్రిత బంగారు పతకం గెలుపొందారు. ఈ సందర్భంగా క్రీడాకారులను కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ పి.పరంధామరెడ్డి, నాగ సీతారాములు, పి.కాశీహుస్సేన్, ఆదినారాయణ తదితరులు అభినందించారు.

అథ్లెటిక్స్‌లో రజత పతకం



పతకంతో క్రీడాకారిణి సింధు

కొత్తగూడెంటౌన్: ఈ నెల 8 నుంచి 12 వరకు ఉత్తరాఖండ్‌లో జరిగిన నేషనల్ గేమ్స్‌లో అథ్లెటిక్స్ విభాగంలో కొత్తగూడేనికి చెందిన క్రీడాకారిణి ఎం.సింధు రజత పతకం సాధించింది. 400 మీటర్ల రిలే పోటీల్లో ప్రతిభ చాటింది. ఈ మేరకు కోచ్ ఎం.నరేష్ సోమవారం వివరాలు వెల్లడించారు. రజత పతకం సాధించిన సింధును కోచ్‌తోపాటు జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి పి. పరంధారెడ్డి, క్రీడా సంఘాల బాధ్యులు సారంగపాణి, కె.మహీధర్, డాక్టర్ యుగంధర్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, రాధాకృష్ణ, బి. హనుమంతరావు, సముద్రాల శ్రీనివాస్, సావిత్రి, ఎండీ బాబ్జీ తదితరులు అభినందించారు.

కొనసాగుతున్న క్రీడాపోటీలు

ఇల్లెందు: పరుశురాం యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్ల గొండ జిల్లాల టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు మూడో రోజూ ఉత్సాహంగా సాగాయి. సీఈఆర్‌క్లబ్ గ్రౌండ్‌లో సోమవారం పోటీలను మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మడత వెంకట్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారులు స్నేహభావం పెంపొందించుకోవాలని సూచించారు. గెలుపు, ఓటములను పట్టించుకోకుండా క్రీడాస్ఫూర్తి చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో జానీ, రాజేందర్, రాజు, మామిడి శివ, మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

జాతరకు ఏర్పాట్లు పూర్తి



అధికారులతో మాట్లాడుతున్న ఏపీఓ డేవిడ్ రాజ్


కరకగూడెం: చిరుమళ్లలో నేటి నుంచి జరిగే సమ్మక్క–సారలమ్మ జాతరకు ఏర్పాట్లు చేసినట్లు భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్ తెలిపారు. సోమవారం జాతర ప్రదేశాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు, పార్కింగ్ తదితర సౌకర్యాలను కల్పించాలన్నారు. అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సీఐ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ నాగ ప్రసాద్, ఎంపీడీఓ కుమార్, ఐటీడీఏ డీఈ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాసానికి దరఖాస్తు

ఐదు రోజుల్లో ముగియనున్న పాలకవర్గ పదవీకాలం

టేకులపల్లి: మండలంలోని బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావుపై అవిశ్వాసానికి తెరతీశారు. సొసైటీలో మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉండగా సోమవారం తొమ్మిది డైరెక్టర్లు డీసీడీ సయ్యద్ ఖుర్షీద్‌కు అవిశ్వాస తీర్మాన దరఖాస్తు అందజేశారు. ఐదు రోజుల్లో సొసైటీ పాలకవర్గ పదవీకాలం ముగియనుండగా, అవిశ్వాసానికి ప్రయత్నాలు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఏడాది కాలంలో లక్కినేనిపై ఇది రెండో సారి అవిశ్వాస ప్రయత్నం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది నెలలకే లక్కినేనిపై అవిశ్వాసానికి ప్రయత్నం చేశారు. నిబంధనల ప్రకారం 9 మంది డైరెక్టర్లు డీసీఓకు దరఖాస్తు ఇవ్వాల్సి ఉండగా 8 మంది మాత్రమే ఇవ్వడంతో ఆ సమయంలో అవిశ్వాసం కుదరలేదు. కాగా మొలకెత్తని, నాసిరకం మొక్కజొన్న విత్తనాల పంపిణీ వ్యవహారంలో సొసైటీ చైర్మన్ ఇటీవల జైలుకు వెళ్లిన విషయం విదితమే.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,487

ఆపద్బాంధవులకు ప్రోత్సాహం



- క్షతగాత్రులను గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రికి తరలిస్తే రూ.5 వేలు
- 'గుడ్ సమరిటన్' పథకం అమల్లోకి తెచ్చిన కేంద్ర ప్రభుత్వం
- మానవత్వం చాటిన వారికి నగదుతోపాటు ప్రశంసా పత్రం

భద్రాచలంఅర్బన్: క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తే ప్రభుత్వం ప్రోత్సాహం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం గుడ్ సమరిటన్ పథకం అమల్లోకి తెచ్చింది. ప్రమాదం జరిగిన గంటలోగా(గోల్డెన్ అవర్)లో ఆస్పత్రికి తరలిస్తే గుర్తింపు పత్రంతోపాటు రూ.5 వేలు నగదు అందించనుంది. గాయపడ్డవారిని ఆస్పత్రికి తీసుకెళ్తే కేసు, పోలీసుల పంచాయితీ ఉంటుందని భయపడి గతంలో చాలా మంది వెనుకాడేవారు. ప్రస్తుతం ప్రజల్లో అవగాహన పెరగడంతోపాటు సహాయం చేసేందుకు ముందుకు వస్తున్నారు. 108 వాహనం అందుబాటులో లేకపోతే తమ వాహనంలో, ఇతర వాహనాల్లోనే ఆస్పత్రికి తీసుకెళ్లి చేర్పుతున్నారు. గుడ్ సమరిటన్ పథకం ద్వారా ఇలాంటి వారికి ప్రోత్సాహం లభించనుంది.

సకాలంలో వైద్యం అందక...

సకాలంలో వైద్యం అందక రోడ్డు ప్రమాద బాధితుల్లో దాదాపు 50 శాతం మృతి చెందుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. కొందరు సహాయం చేయకపోగా క్షతగాత్రులను వీడియో తీసేందుకు ప్రయత్నించడం బాధించే విషయం. కాగా మానవత్వం చాటి, సహాయం అందించేవారికి ప్రోత్సాహం లభిస్తే మరింత సేవ చేస్తారనే కేంద్రం సమరిటన్ పథకం తీసుకొచ్చింది. జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు 108 అంబులెన్స్ వెళ్లాలంటే కొన్నిసార్లు ఆలస్యమవుతోంది. ఆ సమయంలో ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాల్లో ఆస్పత్రికి తరలించేందుకు అవకాశముంది. అయితే ఈ కార్యక్రమంపై గ్రామాలు, పట్టణాల్లో విస్తృత ప్రచారం చేయాల్సి ఉంది. కాగా జిల్లాలో గతేడాది 491 రోడ్డు ప్రమాదాలు జరగగా, 220 మంది మృతి చెందారు. 224 మంది గాయపడ్డారు.

గోల్డెన్ అవర్...

ప్రమాదం జరిగిన గంటలోగా ఆస్పత్రికి తీసుకొస్తే ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీన్నే గోల్డెన్ అవర్‌గా పేర్కొంటున్నారు. ఇప్పుడు కేంద్రం ప్రకటించిన సమరిటన్‌తో గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రిలో చేర్పిన వారికి రూ. 5 వేలు అందనున్నాయి. ఇందుకు దరఖాస్తు చేసుకోవాలంటే పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలు లెటర్ ప్యాడ్‌పై వివరాలు రాసి ఇవ్వాల్సి ఉంటుంది. పోలీసులు కూడా కేసుతో సంబంధం లేకుండా రాసివ్వాలని నిబంధనల్లో పేర్కొన్నారు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, బ్యాంకు ఖాతా నంబరు, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ జత చేస్తే నేరుగా వారి ఖాతాలో నగదు జమ అవుతుంది. ప్రశంసా పత్రం సైతం అందుతుంది.

చైతన్యవంతం చేస్తాం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గుడ్ సమరిటన్ పథకంపై ప్రజలను చైతన్యపరుస్తాం. అవగాహన సమావేశాలు నిర్వహించేలా స్థానిక పోలీస్, వివిధ శాఖల అధికారులకు సూచిస్తాం. గాయపడ్డవారిని ఆస్పత్రిలో చేర్పిస్తే గుర్తింపు లభించడంతోపాటు ప్రభుత్వ ప్రోత్సాహం అందుతుంది. అన్ని వర్గాల ప్రజలు ప్రచారం నిర్వహించాలి.

– విక్రాంత్ కుమార్ సింగ్, ఏఎస్పీ, భద్రాచలం

ప్రచారం చేస్తున్నాం..



ప్రమాదాల్లో గాయపడిన వారికి సహకరిస్తే ఇబ్బందులు ఎదురవుతాయోనన్న సందేహం పెట్టుకోవద్దు. క్షతగాత్రులకు సహాయం చేయడం అంటే వారి ప్రాణాలను కాపాడటమే. ప్రస్తుతం అలాంటి వారికి నగదు ప్రోత్సహకం కూడా లభిస్తుంది. ఈ విషయాలపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం.

– వెంకట పుల్లయ్య, ఎంవీఐ, భద్రాచలం

ఉపాధి సిబ్బంది వేతనాలు విడుదల

మంచుపల్లి: మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సిబ్బంది గత నెల 29 నుంచి నిరసన బాట పట్టారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎట్టకేలకు రెండు నెలల జీతాలను విడుదల చేసింది. గడిచిన రెండు రోజులుగా ఉపాధి సిబ్బంది ఖాతాల్లో వేతనాలు జమ చేస్తోంది. దీంతో జిల్లాలోని 219 మంది ఏపీఓలు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు ఊరట కలగనుంది. ఏపీఓలు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు రెండు నెలల, టెక్నికల్ అసిస్టెంట్లకు మూడు నెలల వేతనం విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా ప్రతి నెలా వేతనం చెల్లించాలని సిబ్బంది కోరుతున్నారు.

సాగునీటి పరికరాలు ధ్వంసం

దమ్మపేట: పామాయిల్ క్షేత్రం గేటు తాళాలను పగులగొట్టి తోటలోని డ్రిప్ పరికరాలను ధ్వంసం చేసిన ఘటనలో సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం గ్రామానికి చెందిన నారం రాముకు దమ్మపేట మండలంలోని పెద్దగొల్లగూడెం శివారులో పామాయిల్ తోట ఉంది. పెద్దగొల్లగూడెం గ్రామానికి చెందిన రావుల శోభన్‌బాబు అనే వ్యక్తి మరో నలుగురితో కలిసి గేటు తాళం పగులగొట్టి గెదేలతో లోపలకు అక్రమంగా ప్రవేశించారు. గెదేలు తొక్కడంతో సాగునీటి డ్రిప్ పరికరాలు ధ్వంసమయ్యాయి. తోట యజమాని ప్రశ్నించగా శోభన్‌బాబు అసభ్య పదజాలంతో దూషించాడు. బాధితుడు రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

మహిళపై అత్యాచారయత్నం

కొత్తగూడెంఅర్బన్: కూలి పని ఉందని మహిళను తీసుకెళ్లి అత్యాచారానికి యత్నించారు. తప్పించుకునే ప్రయత్నం చేసిన ఆమెపై కత్తితో దాడి చేసిన సంఘటన లక్ష్మీదేవిపల్లి మండలంలో సోమవారం జరిగింది. లక్ష్మీదేవిపల్లి పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. పొరుగు రాష్ట్రానికి చెందిన గొత్తి కోయ మహిళను కూలి పని ఉందంటూ పోస్టాఫీస్ సెంటర్ అడ్డా నుంచి ఆటోలో ఓ వ్యక్తి తీసుకెళ్లాడు. అనిశెట్టిపల్లి గ్రామ సమీపంలో చేరుకోగానే ఆమెపై అత్యాచారానికి యత్నించాడు. ఆమె తప్పించుకునే క్రమంలో కత్తితో దాడి చేయగా, మహిళ ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. కాగా అగంతకుడు తప్పించుకుని పారిపోయాడు. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు బాధితురాలిని చికిత్స నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గత శనివారం కొత్తగూడెంలో ఆటో డ్రైవర్లు యువతిని కిడ్నాప్ చేసి లైంగిక దాడికి యత్నించిన ఘటన మరువక ముందే మరో ఘటన చోటుచేసుకోవడంతో పట్టణంలో ఆందోళన నెలకొంది. పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని, నేరచరిత్ర ఉన్న వారి కదలికలను గమనించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

అనుమతిలేని కట్టడాలు కూల్చివేత

చుంచుపల్లి: మండల పరిధిలోని సారయ్య కాలనీలో కోర్టు పరిధిలో ఉన్న భూమిలో అనుమతి లేకుండా వెలిసిన అక్రమ కట్టడాలను సోమవారం రెవెన్యూ, పోలీస్ అధికారుల సమక్షంలో పంచాయతీ సిబ్బంది కూల్చివేశారు. కోర్టు పరిధిలో ఉన్న భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టొద్దని అధికారులు హెచ్చరించారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ మేరకు చర్యలు చేపట్టారు.

ఇసుక నిల్వలు సీజ్



సీజ్ చేసిన ఇసుకను టిప్పర్‌లో లోడ్ చేయిస్తున్న ఆర్ఐ

ములకలపల్లి: మండల పరిధిలోని సీతారాంపురం శివారు వాగు సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను రెవెన్యూ అధికారులు సోమవారం సీజ్ చేశారు. సుమారు ఏడు ట్రాక్టర్ల ఇసుక నిల్వలను సీజ్ చేసినట్లు మండల ఆర్ఐ బాదావత్ భద్రు తెలిపారు. టిప్పర్ లారీ ద్వారా ఇసుకను తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

ఇల్లెందు: పట్టణంలోని మైనారిటీ గురుకులంలో ఉర్దూ టీచర్ రెహానా, కుక్ సరితలపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. అదే స్కూల్‌లో పని చేస్తున్న తెలుగు టీచర్ సంధ్యారాణి ఫిర్యాదు మేరకు ఎస్ఐ సందీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నెల రోజుల క్రితం సంధ్యారాణి వద్ద రూ. 2 వేలు లంచం తీసుకుంటూ అక్కడి ప్రిన్సిపాల్ కృష్ణ ఏసీబీ అధికారులకు దొరికిన విషయం విదితమే. నాటి నుంచి ప్రిన్సిపాల్ సూచనలతో వీరు వేధింపులకు పాల్పడుతున్నారని సంధ్యారాణి ఫిర్యాదులో పేర్కొంది.

లైంగిక వేధింపులపై కేసు

దమ్మపేట: యువతిని లైంగికంగా వేధిస్తున్న యువకుడిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండల కేంద్రం దమ్మపేట గ్రామానికి చెందిన యువతిని మందలపల్లి గ్రామానికి చెందిన యువకుడు కోలా నాగేంద్ర భార్గవ్ కొంతకాలంగా లైంగికంగా వేధిస్తున్నాడు. తనను పెళ్లి చేసుకోవాలని, లేని పక్షంలో చంపుతానని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

ఆర్టీసీ బస్సులో చోరీకి యత్నం

కొత్తగూడెంటౌన్: బస్టాండ్ ఏరియాలో ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలి మెడలో బంగారం దొంగిలించేందుకు యత్నించిన వ్యక్తి పట్టుబడిన సంఘటన సోమవారం జరిగింది. స్థానికులు, ప్రయాణికుల కథనం ప్రకారం.. బస్టాండ్ నుంచి వరంగల్‌కు వెళ్తున్న బస్సులో అనిశెట్టిపల్లికి చెందిన తంబాల నితిన్ అనే వ్యక్తి ప్రయాణికురాలి మెడలో ఉన్న బంగారు నగను దొంగలించేందుకు యత్నించాడు. దీంతో ప్రయాణికులు పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని అతన్ని స్టేషన్‌కు తరలించారు. చోరీపై ఫిర్యాదు రాలేదని, దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

కొమరారం హైస్కూల్‌లో చోరీ

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం హైస్కూల్‌లో క్రీడా సామగ్రి చోరీ జరిగినట్లు సోమవారం గుర్తించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ సుధాకర్ సమాచారంతో కొమరారం ఎస్సై సోమేశ్వర్ పాఠశాలను సందర్శించారు. రాత్రి వేళ గస్తీ ముమ్మరం చేసి రక్షణ కల్పిస్తామని చెప్పారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

టేకులపల్లి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో త్రుటిలో ప్రమాదం తప్పింది. జి.కొత్తతండా గ్రామానికి చెందిన డ్రైవర్ బానోత్ భీమాలాల్ ఆదివారం రాత్రి ట్రాక్టర్ తీసుకెళ్తుండగా వాహనం బొమ్మనపల్లి ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో భూక్యా కళ్యాణ్ ఇంటి మీదకు దూసుకుపోయింది. ఇంట్లో నిద్రిస్తున్న తల్లి, కుమారుడికి త్రుటిలో ప్రమాదం తప్పింది. పెట్రోలింగ్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితుల నుంచి వివరాలు సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కరకగూడెం: మండల పరిధిలోని భట్టుపల్లి గ్రామానికి చెందిన షేక్ ఖదీర్ బైక్‌పై సోమవారం రంగాపురం వెళ్తుండగా, చొప్పాల గ్రామ పంచాయతీ మురికిమడు ప్రధాన రహదారి వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలు కాగా కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, అక్కడి నుంచి మణుగూరు 100 పడకల ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

అనారోగ్యంతో జర్నలిస్టు మృతి



సంతోష్ కుమార్ (ఫైల్)

గుండాల: పది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న జర్నలిస్టు సోమవారం మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన రాచకొండ సంతోష్ కుమార్ (30) పదేళ్ల నుంచి విలేకరిగా పని చేస్తున్నాడు. ఇటీవల కాలంలో అనారోగ్యంతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు ఖమ్మం, వరంగల్ తీసుకెళ్లి వైద్యం అందించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం ఖమ్మం ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. ఆయన మృతదేహం వద్ద పలువురు నివాళులర్పించారు.

గుర్తుతెలియని వ్యక్తి...



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కొత్తగూడెంటౌన్: పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతదేహాన్ని కొత్తగూడెం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి మార్చురీలో భద్రపరచామని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వివరాలకు 87126 82019 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పురుగుల మందు తాగి..

సుజాతనగర్: పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన ఘటనపై సుజాతనగర్ ఠాణాలో సోమవారం కేసు నమోదైంది. ఎస్సై ఎం.రమాదేవి కథనం ప్రకారం.. మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన భూక్యా వినోద్(30) మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి క్షీణించిపోవడంతో మనస్తాపం చెంది ఆదివారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని యాచకుడు..

ఖమ్మంక్రైం: ఖమ్మం శ్రీనివాస టాకీస్ సమీపంలోని ఓ షాప్ ఎదుట గుర్తు తెలియని వ్యక్తి(50) మృతదేహాన్ని సోమవారం గుర్తించారు. ఆయన వద్ద ఎలాంటి లభించకపోవడంతో ఖమ్మం వన్‌టౌన్ పోలీసుల సూచనతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు, సిబ్బంది మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

పదో రోజుకు పంచాయతీ కార్మికుల సమ్మె



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

- వేతనాల్లో కోత విధించొద్దని ఆవేదన
- కలెక్టరేట్ ఎదుట ధర్నా, అఖిలపక్షాల మద్దతు

సూపర్‌బజార్(కొత్తగూడెం): లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలో ఉన్న ఆరు పంచాయతీల కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న సమ్మె సోమవారం 10వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మండల కేంద్రం నుంచి అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో పాదయాత్రగా కలెక్టరేట్‌కు చేరుకుని ధర్నా నిర్వహించారు. సీపీఎం, సీపీఐ, బీఆర్‌ఎస్ పార్టీలు, సీఐటీయూ, ఆదివాసీ సంఘాలు మద్దతు తెలిపి ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. ఆయా పార్టీలు, సంఘాల నాయకులు ఉప్పనపల్లి నాగేశ్వరరావు, లగడపాటి రమేష్, అన్వర్‌పాషా, వాసం రామకృష్ణదొర, భూక్య రమేష్ మాట్లాడుతూ వేతనాలు కేటగిరీల వారీగా రూ.12,600 నుంచి రూ. 17,000 చెల్లించాల్సి ఉండగా, కోత విధిస్తూ రూ.9,500 మాత్రమే చెల్లించేలా నిర్ణయించడం సరికాదన్నారు. ప్రతి నెలా వేతనాలు చెల్లించాలని కోరారు. పదిరోజులుగా సమ్మె చేస్తున్నా అధికారులలో చలనం లేదని విమర్శించారు. ధర్నా వద్దకు డీపీఓ చంద్రమౌళి వచ్చి వినతిపత్రం స్వీకరించారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెలోకి..

ఆర్టీసీ జేఏసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి నారాయణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

మణుగూరు రూరల్ : సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదని ఆర్టీసీ జేఏసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జీఎస్ నారాయణ అన్నారు. సోమవారం మణుగూరు ఆర్టీసీ డిపో వద్ద జరిగిన గేట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల 25న ఆర్టీసీ యాజమాన్యాలకు టీజీ ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె నోటీస్ ఇచ్చామని తెలిపారు. అయినా ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం నిర్లక్ష్యం వీడటం లేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న కార్మిక శాఖ జేఏసీని చర్చలకు పిలిచిందని, యాజమాన్యం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే సమ్మెకు వెనుకాడేది లేదన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. జేఏసీ నాయకులు వి. పవన్‌కుమార్, సీహెచ్. లింగయ్య, పి.మురళీమోహన్‌రావు, మధుసూదన్, పి.మధు, పూర్ణచందర్ రావు, బి.శివ, లాలయ్య, రమాదేవి పాల్గొన్నారు.